క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోండి

కోట: ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ ప్రసాద్‌రావు సూచించారు. శుక్రవారం కోట మండలం కేసవరంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ఉమ, ఏఓ నిరంజన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలోని 23 వార్డు కుమ్మరివీధిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ శుక్రవారం పరిశీలించారు. వార్డులో పలు చోట్ల సుమారు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రఫీ తెలిపారు.

ఎంఈఓలకు సన్మానం



వెంకటగిరి: ఎంఈఓ–1 టి వెంకటేశ్వర్లు, ఎంఈఓ-2 సి బాబయ్యను యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె ఉదయ్‌కుమార్, మండల అధ్యక్షురాలు డి జగదీశ్వరి, ప్రధాన కార్యదర్శి కె ఆదినారాయణ, పీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నివేదికలిస్తే నిధులు తెస్తా

చిల్లకూరు: గూడూరులోని గాంధీనగర్ నుంచి చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు వరకు నూతన రహదారి నిర్మాణానికి అధికారులు నివేదికలు ఇస్తే నిధులు తెస్తామని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలసి ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

కాంప్లెక్స్ పనులు ప్రారంభం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శిథిలావస్థకు చేరిన నేదరుమల్లి జనార్దన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి, నూతన భవనాల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని తీర్మానించారు. ఈ క్రమంలో కొత్తగా షాపింగ్ కాంప్లెక్ నిర్మిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా పొంగళ్లు



ఓజిలి: కురగొండ గ్రామదేవత నాగార్పమ్మకు గ్రామస్తులు శుక్రవారం పొంగళ్లు పెట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. నాగార్పమ్మ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కే సుధాకర్‌రెడ్డి, నాయుడుపేట జెడ్పీటీసీ సభ్యురాలు కే జ్యోతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎం ఇందిరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం ప్రభాకర్‌రెడ్డి, ఎం సుబ్బారావుయాదవ్, ఏ దిలీప్‌కుమార్‌రెడ్డి, ఎం రవీందర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బీ సుధాకర్‌యాదవ్ దర్శించుకున్నారు. ఓజిలిలో నాగార్పమ్మకు పొంగళ్లను పెట్టారు.

రెండో రోజూ ఆందోళన

సైదాపురం: పోలీసుస్టేషన్‌లో ఆత్మహత్యకు పాల్పడిన ఆకాష్‌రాం మృతికి నిరసనగా అతడి బంధువులు, ఎమ్మార్పీస్ నాయకుల ఆధ్వర్యంలో సైదాపురం పీఎస్ ఎదుట రెండో రోజు శుక్రవారం కూడా ఆందోళనను కొనసాగించారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ మృతుడు ఆకాష్‌రాం కుటుంబ సభ్యులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. తమ పరిధిలో ఉన్న వాటిని తక్షణమే అమలు చేస్తామని ఆర్డీఓ మలోల తెలిపారు. అయినా ఆందోళనను విరమించకపోవడంతో నెల్లూరు ఏఎస్పీ హిమావతి సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పై చర్చించారు.

108లో ప్రసవం

వెంకటగిరి: ఆస్పత్రికి తరలిస్తున్న నిండు గర్భిణి 108 అంబులెన్స్‌లో మగశిశువుకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది కథనం మేరకు.. డక్కిలి మండలం తీర్థంపాడు గ్రామానికి చెందిన భారతి నిండు గర్భిణి. ఈమెకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంకటగిరి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తీసుకువచ్చారు. వైద్యులు ఆమెను తిరుపతికి సిఫార్సు చేశారు. ఆమె 108లో తిరుపతి తరలిస్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ సిబ్బంది ఆలీ తదితరులు ఆమెకు సహజ ప్రసవం చేయించారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌వద్ద బైక్‌ను వెనుకనుంచి బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరిలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పశ్చిమ బంగాలోని కోల్‌కత్తాకు చెందిన బినోద్(22), సోమిన్ నాంచారమ్మపేట సమీపంలోని రొయ్యల గుంతల్లో పనిచేస్తున్నారు. వీరు కూరగాయలు కొనుగోలు చేసేందుకు గూడూరు వచ్చి తిరుగుప్రయాణంలో ఉండగా, విజయవాడ నుంచి తిరుపతికి వెళుతున్న బొలేరో ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్‌లో క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ బినోద్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బొలేరో డ్రైవర్ హరికృష్ణను అదుపులోకి తీసుకున్నారు.



సూళ్లూరుపేటలో నివాసమున్న ఎం కామేశ్వరిది విశాఖ పట్టణం. అయితే బతుకు దెరువు నిమిత్తం ఇక్కడ బంధువుల ఇంట్లో ఉంటోంది. అయితే ఈమెకు వైజాగ్‌లో జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం మంజూరు చేశారు. ఆమె అక్కడ నివాసం లేదని పట్టా రద్దు చేయకుండా ఆమె సూళ్లూరుపేటలో ఉందన్న విషయం కనుక్కున్నారు. అక్కడి సచివాలయం సిబ్బంది సూళ్లూరుపేట 23వ వార్డు సచివాలయానికి సమాచారం అందించి, అక్కడి ఇంటి స్థలం పట్టాను ఇక్కడ అందజేశారు. ఇదంతా జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతోనే సాధ్యమైందని ఆమె తన సంతోషం వ్యక్తం చేసింది.



నూరుల్ హాసన్‌ది సూళ్లూరుపేట వనంతోపు ఏరియా. ఈయనకు ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరూ ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్నారు. వీరికి అమ్మఒడి పథకం రాలేదని ఆయన సచివాలయానికి వెళ్లి అర్జీ ఇచ్చారు. ఎందుకు రాలేదని వార్డు వలంటీర్లు రికార్డులు పరిశీలించగా రేషన్‌కార్డులో పొరపాటు ఉందని చెప్పి సంబంధిత వీఆర్వోకు సమస్యను పంపారు. వీఆర్వో వెంటనే స్పందించి రేషన్‌కార్డులో పిల్లలు పేర్లు ఎంటర్ చేసి సచివాలయ సిబ్బందికి పంపడంతో వారు నూరుల్‌హాసన్ ఆధార్‌కార్డు, పిల్లల ఆధార్‌కార్డులు తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. రేషన్‌కార్డు ఇచ్చి అమ్మఒడి పథకం అందేలా చేశారు.

సచివాలయం.. పల్లెకు మకుటం

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతితోనే అభివృద్ధి సాధ్యమన్న మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో సాకారమైంది. పల్లె ప్రజల అవసరాలు, కష్టాలు తీర్చేలా గ్రామంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు, వలంటీరు వ్యవస్థలతో పూర్తి పారదర్శకంగా.. నేరుగా జనం గడపలోకే సేవలు అందుబాటులోకి వచ్చాయి. పింఛన్ నుంచి ఇంటి పట్టా వరకూ ఏది కావాలన్నా, నీటి సమస్య నుంచి రెవెన్యూ సమస్యల వరకూ, సర్టిఫికెట్ల నుంచి శిశు సంక్షేమం వరకూ అన్ని పనులూ గ్రామ సచివాలయాల ద్వారానే పూర్తవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



సూళ్లూరుపేట మున్సిపాలిటీలో 22, 23వార్డులకు సంబంధించిన సచివాలయం ఇది

- సాకారమవుతున్న జాతిపిత కల
- పల్లె ముంగిటకు ప్రభుత్వ యంత్రాంగం
- మండల కేంద్రం చుట్టూ ప్రదక్షిణల కష్టాలకు తెర
- లబ్ధిదారులకు సమయం, ఖర్చు ఆదా

సూళ్లూరుపేట: సచివాలయాలు సేవాలయాలుగా జనం మన్ననలు అందుకుంటున్నాయి. 2019 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సూళ్లూరుపేట మండలంలో 9, మున్సిపాలిటీలో 11 సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం మారుమూల గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రం, మున్సిపాలిటీ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టానికి వీటితో తెర పడింది. సచివాలయాల ద్వారా గ్రామ స్థాయిలోనే జనం బాధలు, అవసరాలు తీర్చే పటిష్టమైన యంత్రాంగం అందుబాటులోకి వచ్చింది. దీనికి అనుబంధంగా గ్రామ వలంటీరు వ్యవస్థ తోడు కావడంతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, వాటిని అందుకోవడం వంటివి ఇంటి ముంగిటనే సాధ్యం అవుతోంది. గతంలో పనులు మానుకుని వ్యయ, ప్రయాసలతో మండల కేంద్రానికి, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లినా వాటి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కానీ సచివాలయాల ద్వారా ఒకే ప్రాంగణంలో దాదాపు 35 ప్రభుత్వ శాఖల పనులు చేయించుకునే అవకాశం కలిగింది. ప్రతి సేవకు నిర్ణీత సమయాన్ని ప్రభుత్వం నిర్దేశించడంతో సచివాలయ సిబ్బంది గడువు లోపే ఆయా పనులు పూర్తి చేస్తున్నారు. అన్ని పథకాల లబ్ధిదారుల జాబితాలను పారదర్శకంగా నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తున్నారు.

మండలం: సూళ్లూరుపేట	
మొత్తం సచివాలయాలు	8
సచివాలయ సిబ్బంది సంఖ్య	60
వలంటీర్ల సంఖ్య	214
మున్సిపాలిటీ పేరు: సూళ్లూరుపేట	
మొత్తం సచివాలయాలు	11
సచివాలయ సిబ్బంది సంఖ్య	67
వలంటీర్ల సంఖ్య	200

సచివాలయ వ్యవస్థ బాగుంది

సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది. సమస్యలతో వచ్చిన బాధితులకు అక్కడికక్కడే న్యాయం జరుగుతుండడం విశేషం. మొదట్లో ఇది సాధ్యమేనా అనుకున్నాం గానీ.. ఈ వ్యవస్థ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది. సమస్య వస్తే వెంటనే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది స్పందించి పరిష్కరిస్తున్నారు మా పరిధిలో ఉండే సమస్యలకు కూడా అక్కడికక్కడే రాస్తున్నాం. ప్రతి సచివాలయంలో ఒక వీఆర్వో కూర్చోవాల్సిందే. మండల రెవెన్యూ కార్యాలయాలకే పరిమితమైన వీఆర్వోలు ఇప్పుడు సచివాలయంలోనే కూర్చునే పద్ధతి కొంచెం కష్టమనిపించినా నిజంగా చేయాల్సిన పని ఇదే. సమస్యలతో వచ్చిన ప్రజలకు న్యాయం జరుగుతుంది.

– వీరాస్వామిరెడ్డి, వీఆర్వో, ఇందిరానగర్, సూళ్లూరుపేట

పారదర్శకంగా ఉపాధి పనులు



మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

దక్కిలి: ఉపాధి హామీ పనులను పారదర్శంగా, అవినీతి రహితంగా నిర్వహించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండలంలో 2022–23 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి శుక్రవారం సామాజిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 పంచాయతీల్లో వివిధ శాఖలకు సంబంధించి రూ.9.30 కోట్లతో ఉపాధి పనులు చేపట్టామన్నారు. ఆ పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందన్నారు. అన్ని పంచాయతీల్లో జరిగిన పనుల్లో కొలతలు, సంతకాలు తేడాలు ఉన్నాయని గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా రూ. 40 వేలు రికవరీకి ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, డీపీఓ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరయ్య నాయుడు, రాష్ట్ర బృందం సభ్యుడు లోకేష్‌రెడ్డి, ఏపీడీ రవికుమార్‌నాయుడు, మండల ప్రత్యేకాధికారి మునిరామ్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎస్సార్పీ నాగరాజు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఉపాధి పనులు

ఉపాధిహామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలని డ్వామా పీడీ సీవీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. ప్రజావేదిక అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు.

దుర్గామల్లేశ్వరిదేవికి పూజలు

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నూతనంగా దక్షిణమూర్తి, నవగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించి మండల రోజులు పూర్తి కావడంతో శుక్రవారం అమ్మవారితో పాటు దక్షిణమూర్తికి అభిషేక పూజలు చేశారు.

తప్పిన ప్రమాదం

దొరవారిసత్రం: ఏకొల్లు ఎస్సీకాలనీలో చెట్ల మధ్యలో విద్యుత్ తీగలు ఉండడంతో గాలులకు శుక్రవారం తెగి కింద పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ట్రాన్స్‌కో సిబ్బంది చెట్లను తొలిగించి విద్యుత్ లైన్లు మరమ్మతు చేశారు.

విజయవంతం చేయాలి

వెంకటగిరి: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ నుంచి 30వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించే రాష్ట్ర యువజన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి కత్తి రవి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శుక్రవారం ఆ సమ్మేళనానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు జావిద్, సురేంద్రబాబు, సాయికుమార్, మహమ్మద్ ఆరిఫ్, భాను, వెంకటేష్, చిరంజీవి పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్‌లు ఏర్పాటు

గూడూరు: ప్రజల సౌకర్యార్థం గూడూరులో పలు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఏనుగు నరహరిరెడ్డి పార్కులో డాక్టర్ జనార్దన్‌రెడ్డి, రోహిణి దంపతుల దాతృత్వంతో ఏర్పాటు చేసిన సీఆర్ రెడ్డి– రోటరీ క్లబ్ టాయిలెట్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కిరణ్ చక్రవర్తి, దశరథరామిరెడ్డి, మునిగిరీష్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరురూరల్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ మనోజ్ కుమార్ అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీని బలిదాన్ దివాస్ సందర్భంగా శుక్రవారం గూడూరులోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం గూడూరుశాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు చైతన్య, శివశంకర్, నరేంద్ర, ప్రసాద్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆందోళన

గూడూరురూరల్: పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ నాయకులు చిన్నా మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పుస్తకాలు, యూనిఫామ్ కూడా అధిక ధరలకు అమ్ముతున్నారని, విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాయింట్ సర్వేతో సమస్య పరిష్కరిస్తాం

బాలాయపల్లి (వెంకటగిరిరూరల్): జాయింట్ సర్వేతో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చిలమనూను ఎస్టీకాలనీలో జగనన్న లే అవుట్‌లో ఇళ్లు నిర్మించుకుంటున్న గిరిజనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని 4 రోజుల కిందట యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి చెంచుమల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం బాలాయపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు చిలమనూరులోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఆయన గిరిజనులతో మాట్లాడుతూ వెంకటగిరి అటవీశాఖ రేంజర్ రాజేంద్రప్రసాద్‌తో చర్చించి, రెండురోజుల్లో జాయింట్‌సర్వే చేసి, గిరిజనులకు న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు. యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి చెంచు మల్లికార్జునరావు పాల్గొన్నారు.



రైతు పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



రైతులకు హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీకృష్ణ

చిల్లకూరు: అన్నదాతలకు అండగా నేనున్నానంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. చిల్లకూరు రెవెన్యూ కార్యాలయం ఆవరణలో శుక్రవారం గూడూరు డివిజన్‌లోని ఐదు మండలాలకు చెందిన చుక్క భూముల సమస్యలను పరిష్కరించి, సంబంధిత రైతులకు హక్కు కల్పిస్తూ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని చుక్కల భూముల సమస్యను నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించి ఎంతో మంది రైతుల ఆశలు చిగురింప చేశారన్నారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో 1,842 మంది రైతులకు చెందిన 3,755 ఎకరాలను రెగ్యులర్ చేశామన్నారు. సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఏఎంసీ చైర్ పర్సన్ ఓడూరు యమునమ్మ, జిల్లా రిజిస్ట్రార్ శ్రీరాంకుమార్, జెడ్పీటీసీ సభ్యులు మన్నెం శీనయ్య, యామిని, ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ పాల్గొన్నారు.



మహనీయుల విగ్రహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

మహనీయుల విగ్రహాల పరిశీలన

గూడూరు: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని కారు స్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీ భాయి పూలే, జగ్జీవన్‌రామ్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, మదర్ థెరిస్సా విగ్రహాలను శుక్రవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు మీరారెడ్డి, బీసీ నాయకులు భాస్కర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

26 నుంచి సప్తాహం

గూడూరు : పట్టణ సమీపంలోని షిరిడీ సాయినగర్‌లో ఉన్న సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 26 నుంచి జులై 3వ తేదీ వరకు సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తామని ఆ మందిరం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ సి.రోహిణి కోరారు. శుక్రవారం గూడూరులోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను సాయిబాబా మందిరం పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి సందర్భంగా వారం రోజులపాటు సాయి బాబా మందిరంలో సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గురుపౌర్ణమి రోజున సాయి సత్య వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్రతంలో పాల్గొన దలిచిన భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు జనార్దన్‌రెడ్డి, చెంచురామయ్య, ప్రసాద్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

కోట: మండలంలోని చిట్టేడు వద్ద శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి తెలిపారు. కేసవరానికి చెందిన రామయ్య అనే వ్యక్తి మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గూడూరు చేరిన పాదయాత్ర

గూడూరురూరల్: కాకినాడ జిల్లా కేంద్రంలో మే 31వ తేదీన స్వయంభు భోగి గణపతి పీఠం ఆధ్వర్యంలో భక్తులు చేపట్టిన తిరుమల పాదయాత్ర శుక్రవారం రాత్రి గూడూరుకు చేరుకుంది. ఇప్పటివరకు 575 కిలో మీటర్ల మేరకు పాదయాత్ర కొనసాగిందని పీఠం వ్యవస్థాపక ఉపాసకుడు డీ రమణరాజు తెలిపారు. 108 రోజుల దీక్షతో 41 రోజులు పాదయాత్ర చేసి, తిరుమలకు చేరి మళ్లీ కాలినడకనే కాకినాడ పీఠానికి చేరుకుంటామన్నారు.

పర్యాటక కేంద్రంగా శ్రీనివాససత్రం

కోట: మండలంలోని శ్రీనివాససత్రం గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అధికారులు తెలిపారు. శుక్రవారం శ్రీనివాససత్రం సముద్ర తీర ప్రాంతాన్ని టూరిజం శాఖ అధికారులు శ్రీనివాసులు, అనుపమ పరిశీలించారు. తీరప్రాంతాలను అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా కోట మండలంలోని శ్రీనివాససత్రం గ్రామానికి పర్యాటక ప్రాంతంగా అన్ని అనుకూలతలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇక్కడ షెల్టర్ల నిర్మాణంతో పాటు పర్యాటక వసతులు సమకూర్చేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం ఉపసర్పంచ్ ఉప్పల ప్రసాద్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అల్లాబక్ష్, ఫిషరీష్ ఈఓ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెంలో ఉన్న పట్టాభిరామాలయంలో శుక్రవారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నాదస్వర కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు, పట్టాభిరామ ఆలయ ధర్మకర్త కే దామోదర్‌రెడ్డి దాతృత్వంతో నాదస్వర కళాకారులను సత్కరించి, ప్రోత్సాహ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు, శ్రీనివాసులురెడ్డి, రూపేష్‌శర్మ, శ్రీరామసేన అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న ఉపాధి ఏపీఓ గిరి

చిల్లకూరు: ఉపాధి కూలీలకు సంబంధించిన ప్రతి రికార్డు పక్కాగా ఉండాలని ఉపాధి ఏపీఓ గిరి అన్నారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలతో రోజ్‌గార్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కూలీలకు సబంధించి ఏడు రకాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి క్షేత్ర సహాయకుడు ఉపాధి పనులకు సంబంధించి ఏడు రికార్డులను నమోదు చేయాలని, ఎవరైనా ఉన్నతాధికారులు వచ్చి అడిగిన సమయంలో వాటిని కచ్చితంగా చూపాలన్నారు. ఆయన వెంట క్షేత్ర సహాయకులు శేషురెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

నాయుడుపేటటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద శుక్రవారం వలంటీర్లుకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ అర్బన్ కన్వీనర్ చదలవాడ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్, కమిషనర్ శ్రీనివాసరావు, ఎంఎల్ఓ షరీఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు అశోక్‌కుమార్, బంగార బాబు, డీ లక్ష్మీ నారాయణ రెడ్డి, సాధు మోహన్, తుంగా వీరయ్య పాల్గొన్నారు.

షెడ్యూల్ ఖరారు

నాయుడుపేట: మండలంలో జగనన్న సురక్ష షెడ్యూల్ ఖరారైనట్లు ఎంపీడీఓ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. జులై 3 నుంచి ప్రతి గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 3వ తేదీన కూచివాడ సచివాలయం, 5న కాపులూరు ప్రాథమిక పాఠశాల,7న గొట్టిప్రోలు సచివాలయం, 11న పూడేరు, 13న విన్నమాల ప్రాథమిక పాఠశాల, 15న బీమవరం సచివాలయం, 18న కల్లిపేడు, 20న అన్నమేడు, 22 పుదూరు, 25న జువ్వలపాళెం, 27న మేనకూరు సచివాలయాల వద్ద సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.



పెళ్లకూరు: మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

సమస్యల గుర్తింపునకే జగనన్న సురక్ష

ఓజిలి: ప్రజల సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సుమన్, ఎంఈఓ శైలజ, ఏపీఓ ఉషారాణి పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

సైదాపురం: జగనన్న సురక్ష ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య పాల్గొన్నారు.



సైదాపురం: సీఎం సందేశాన్ని వీక్షిస్తున్న అధికారులు

విజయవంతం చేయాలి

సూళ్లూరుపేట రూరల్: జగనన్న సురక్షను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రమీలా రాణి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఎం ప్రసంగాన్ని తహసీల్దార్ రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వీక్షించారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

పెళ్లకూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.